క్లుప్తంగా

ముస్లింలకు ఎంపీ కోమటిరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు

రామగిరి(నల్లగొండ) : భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముస్లింలకు శుక్రవారం రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అల్లా కష్టాలను తొలగించి, శాంతి, సంపద, ఆరోగ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. శనివారం నల్లగొండ పట్టణంలోని ఈద్గాలో రంజాన్ వేడుకల్లో ఆయన పాల్గొననున్నట్లు తెలిపారు.

పరామర్శ



మారయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జూలూరి గౌరీశంకర్

చండూరు : మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన మహబూబ్‌నగర్ ఎస్పీ కొత్తపల్లి నర్సింహగౌడ్ తండ్రి కొత్తపల్లి మారయ్య(75)ఇటీవల గ్రామంలో మృతి చెందారు. దీంతో ఎస్పీ కుటుంబాన్ని శుక్రవారం రాత్రి రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, రాష్ట్ర ఎక్సైజ్ క్రీడా పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్, ప్రజా సంబంధాల అధికారి వెంకట్‌గౌడ్, భువనగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, ఆధ్యాత్మికవేత్త శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన



అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ పద్మ

మర్రిగూడ : మండల పరిధిలోని కుదాభక్షపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మిర్యాల పద్మ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, తల్లులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విఘ్నేశ్వరి, విజయ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా కోకన్వీనర్‌గా వెంకటేష్



నియామకపత్రం అందుకుంటున్న వెంకటేష్

చండూరు : గట్టుప్పల మండల కేంద్రానికి చెందిన వెంకటేష్ ఓబీసీ నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా కోకన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఓబీసీ రాష్ట్ర కన్వీనర్ ఆలే భాస్కర్‌రాజు, నాయీబ్రాహ్మణ సెల్ రాష్ట్ర కన్వీనర్ పసుపుకుంట్ల వికాస్ శుక్రవారం వెంకటేష్‌కు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన మునుగోడు నాయకులు

మునుగోడు : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం మునుగోడు రాజకీయాలను వివరించడంతో పాటు కమిటీల ఏర్పాటుపై సీనియర్ నాయకుల అభిప్రాయాలను తీసుకోవాలని విన్నవించారు. కలిసిన వారిలో పార్టీ నాయకులు మేకల ప్రదీప్‌రెడ్డి, మారగోని అంజయ్యగౌడ్, బొల్లం వెంకన్నయాదవ్, మేకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సుభద్ర

మునుగోడు : బాలికలపై అత్యాచారాలు, బాల్య వివాహాలను అడ్డుకోవాలని ఐసీడీఎస్ పీడీ సుభద్ర అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం మునుగోడు ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు పరిధిలోని మండలాల సిబ్బందికి బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల హక్కులపై గ్రామాల్లోని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి సూచించారు. బాల్య వివాహాలు, గర్భస్థ పిండ లింగార్ధణ పరీక్షలు చేసుకోకుండా చూడాలన్నారు. బాలికలను వేధిస్తే పోక్సో చట్టం ప్రకారం శిక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంఎస్కే కోఆర్డినేటర్ సునీత, సీడీపీఓ కవిత, ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పంచాయతీ కార్యదర్శి మాలతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కూలీలతో మాట్లాడి అనంతరం హాజరు వేశారు. ఆమె వెంట ఫీల్డ్ అసిస్టెంట్ సల్వోజు యాదయ్య, మేట్లు కారింగు నర్సింహ, పోలగాని రాజు, మల్లయ్య, కృష్ణయ్య, యాదయ్య, జ్యోతి, అనిత ఉన్నారు.

పల్లెలకు పచ్చని తోరణాలు

- రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన హరితహారం మొక్కలు
- ఆహ్లాదం..ఆనందాన్ని పంచుతున్న చెట్లు
- సేదతీరుతున్న ప్రయాణికులు



కనగల్ - జి. యడవల్లి గ్రామాల మధ్య ఏపుగా పెరిగిన చెట్లు

కనగల్ : మానవ మనుగడకు చెట్లే జీవనాధారం. అలాంటి చెట్లను బాధ్యతగా పెంచితే ఇలాంటి ఫలితాలు వస్తాయనేందుకు ఈ రోడ్ల వెంట ఉన్న చెట్లే నిదర్శనం. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి ప్రయాణికులకు, బాటసారులకు నీడనిస్తూ ఆహ్లాదాన్ని.. ఆనందాన్ని పంచుతున్నాయి. కనగల్ మండల కేంద్రం నుంచి బుడుమర్లపల్లి, కుమ్మరిగూడెం, బచ్చన్నగూడెం, జి యడవల్లి గ్రామాల మీదుగా చండూరు వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్లు పచ్చదనంతో కళను సంతరించుకుంటున్నాయి. ఎంత ఎండ వచ్చినా వాహనదారులు ఈ ప్రదేశానికి వస్తే చాలు ఎండ నుంచి ఉపశమనం పొందుతారు. అదే విధంగా శాబ్దుల్లాపురం నుంచి రేగట్టే గ్రామం వరకు, ధర్వేశిపురం గ్రామం నుంచి మంచినీళ్ల బావి గ్రామం వరకు హరితహారంలో నాటి మొక్కలు పెద్దవిగా కావడంతో రోడ్ల వెంట వెళ్లే వాహనదారులు, బాటసారులకు చెట్లు ఉన్న ప్రాంతంల్లో కాసేపు ఆగి ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు.

ఎండ నుంచి ఉపశమనం..

గత పది రోజుల నుంచి ఎండలు దంచికొడుతుండటంతో వాహనదారులు ఇంటి నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రయాణిస్తూ అలసిపోతున్న వారు ఈ చెట్ల వద్దకు రాగానే కాసేపు అలసట తీసుకుని సేదతీరి వెళ్తున్నారు.



శాబ్దుల్లాపురం - రేగట్టే గ్రామాల మధ్య..



ధర్వేశిపురం - మంచినీళ్లబావి గ్రామాల మధ్య..



బుడుమర్లపల్లి - జి. యడవల్లి గ్రామాల మధ్య..

ప్రయాణం ఆనందంగా ఉంటుంది



కనగల్ ఎక్స్‌రోడ్డు నుంచి మా గ్రామం వరకు రోడ్డు వెంట ప్రయాణిస్తుంటే చాలా ఆనందంగా, సంతోషంగా అనిపిస్తుంది. ఎంత ఎండ వచ్చినా ఈ ప్రాంతంలో ప్రయాణించాలనే కోరిక కలుగుతుంది. ఈ రహదారి వెంట పచ్చని పంట పొలాలు ఉండటంతో చెట్లు ఎండిపోకుండా పచ్చదనాన్ని ఎప్పుడు సంతరించుకుంటున్నాయి.

– గౌని నరేష్‌గౌడ్, జి యడవల్లి గ్రామస్తుడు

కాసేపు సేదతీరి వెళ్తాం



మా గ్రామం నుంచి రేగట్టే వెళ్లే ప్రధాన రహదారిలో కిలోమీటర్ పొడవునా హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. సూర్యుడి ఎండ రోడ్డు మీద పడకుండా నీడనిస్తుండటంతో ఈ చెట్ల కిందే రోజు కాసేపు మధ్యాహ్నం సేదతీరుతాం. ఉపాధిహామీ పనికి వెళ్లిన వారు, రోడ్డు వెంట ప్రయాణించి అలసిపోయిన వారు ఈ చెట్ల వద్దకు వచ్చి కాసేపు ఆగి వెళ్లిపోతారు.

– కారింగు పురుషోత్తంగౌడ్, శాబ్దుల్లాపురం

ట్యాబ్ ఎంట్రీ వెంటనే పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నల్లగొండ : కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబ్ ఎంట్రీ జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ధాన్యం కొనుగోళ్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యం ఆరబోసి తాలు, రాళ్లు లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కలిగించాలని కోరారు. అనంతరం పట్టణంలోని రామలక్ష్మణ్ రైస్ మిల్లులో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన లారీల నుంచి అన్ లోడింగ్, స్టోరేజీ విధానం పరిశీలించారు. ధాన్యం అన్ లోడింగ్ మిల్లుల్లో వెంట వెంటనే చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ : మైనార్టీల ఆర్థికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని 32మంది లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ముస్లిం, మైనార్టీలకు షాదీముబారక్‌తో పాటు విదేశీ విద్యకు రూ.20లక్షలు, ప్రత్యేక గురుకుల పాఠశాలలు, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నగదు ఇప్పించడం వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అందుకే ముస్లిం, మైనార్టీలు తెలంగాణ ప్రభుత్వానికి మరింతగా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అభిమన్యు శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నల్లగొండ మండల పార్టీ అధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాసరెడ్డి, పలువురు మైనార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిరుమర్తికి మైనార్టీ నాయకుల కృతజ్ఞతలు



కృతజ్ఞతలు తెలుపుతున్న మైనార్టీ నాయకులు

నకిరేకల్ : పట్టణంలో షాదీఖానా నిర్మాణానికి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి రూ.కోటి నిధులు మంజూరు చేయించడాన్ని హర్షిస్తూ శుక్రవారం రాత్రి మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు జాఫర్, అమీర్‌పాష, మోయిజ్, వలీ తదితరులు ఉన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : వేసవికాలం ప్రారంభమైనందున మండలంలో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా నూతనంగా రూపొందించిన ఎంపీపీ కార్యాలయం, సమావేశ మందిరాలను ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సహకారంతో మండల కేంద్రంలో పేద విద్యార్థుల కోసం త్వరలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయనున్నట్లు, అదే విధంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా సబ్‌మార్కెట్ యార్డును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు అవసరమైన నివేదికలను అందించాలని అధికారులను కోరారు. అదే విధంగా ఎండ తీవ్రంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా చూడాలన్నారు. అనంతరం మండల నూతన ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన సైదాబాబును సమావేశంలో ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు సహకరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కల్లూరు యాదగిరి, ఎంపీడీఓ యాదగిరి, డిప్యూటీ తహసీల్దార్ మురళిమోహన్, ఎస్‌ఐ సైదాబాబు, ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి, చిరుమర్తి యాదయ్య, పుల్లెంల ముత్తయ్య, పాషా, శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాను రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం



రిలే నిరాహార దీక్ష చేస్తున్న అఖిలపక్ష నాయకులు

మునుగోడు : ప్రజల ప్రాణాలకు హాని కలిగించే ఫార్మా కంపెనీని రద్దు చేసేవరకు తాము ఉద్యమాలు కొనసాగిస్తామని గట్టుప్పల్ మండల బీఆర్‌ఎస్ పార్టీ కన్వీనర్ ఈడెం కైలాస్‌నేత అన్నారు. మండలంలోని కిష్టాపురంతో పాటు గట్టుప్పల్ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీల నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కిష్టాపురం గ్రామంలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న మునుగోడు మండలంలో ఫార్మా కంపెనీలు ఏర్పాటుచేస్తే వందఏళ్ల వెనకబాటుకు గురవుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి సాగునీరు అందించాలే తప్పా ఫార్మా కంపెనీల నిర్మాణం చేపట్టవద్దన్నారు. తమ ప్రాణాలు ఉన్నతవరకు ఫార్మా కంపెనీలను రద్దు చేసేందుకు పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు, మాజీ జెడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, అఖిలపక్ష నాయకులు పాల్వాయి చెన్నారెడ్డి, ఈదులకంటి కైలాస్‌గౌడ్, పోగుల సుధాకర్‌రెడ్డి, ఆకుల అనిల్, వెంకన్న, సతీష్, లింగస్వామి, శ్యామ్‌సుందర్, శేఖర్, భూపాల్, భరత్, స్వామి, వెంకన్న పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిబ్బందికి ఇఫ్తార్ విందు




నల్లగొండ క్రైం : ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎస్పీ అపూర్వరావు తదితరులు

నల్లగొండ క్రైం : రంజాన్ పర్వదినం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిబ్బందికి శుక్రవారం పోలీస్ ఆడిటోరియంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అపూర్వరావు, ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారి శేషాద్రినిరెడ్డి, ఏఎస్పీ వరప్రసాద్ పాల్గొన్నారు. రంజాన్ సంతోషంగా నిర్వహించుకోవాలని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

నాంపల్లి : రంజాన్ పండగ సందర్భంగా మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకుడు కర్నాటి విద్యాసాగర్ శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అల్లంపల్లి ఆనంద్, తిప్పని వెంకట్‌రెడ్డి, బెల్లి సత్తయ్య, సంగెపు గణేష్, నాంపల్లి సత్తయ్య, పోలోజు వెంటాచారి, సర్వద్దీన్, ఖైరత్‌జానీ, హమీద్, చాంద్‌పాషా, ఖలీల్, టిప్పుసుల్తాన్, జానీపాషా, తదితరులు ఉన్నారు.

ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ : హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈనెల 29న హైదరాబాద్‌లోని లేబర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో హమాలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. హమాలీలకు పనిభద్రత, కనీస వేతనం పీఎఫ్ ఈఎస్‌ఐ, ఆరోగ్యబీమా, ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, సాగర్ల యాదయ్య, సుందరయ్య, మారయ్య, అంజనేయులు ఉన్నారు.

శాలిగౌరారం మండలంలో వర్షం

శాలిగౌరారం : మండలంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం భారీగా కురిసింది. దీంతో మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న వేల క్వింటాళ్ల ధాన్యం తడిసింది. ఆయా కొనుగోలు కేంద్రాలలో సుమారు 1.50లక్షల క్వింటాళ్ల ధాన్యం రాసులు నిల్వ ఉన్నాయి. ఆయా కేంద్రాలలో లోతట్టు ప్రాంతంలో పోసిన ధాన్యం వరదనీటికి కొట్టుకుపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది.

కొనసాగుతున్న వీఓఏల నిరవధిక సమ్మె



చిట్యాల : సమ్మెలో మాట్లాడుతున్న వీరారెడ్డి



నకిరేకల్ : నిరసన తెలుపుతున్న వీఓఏలు

రామగిరి(నల్లగొండ) : సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 5వరోజు కొనసాగింది. తిప్పర్తి మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏలు చెవిలో పువ్వులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు భీమగాని గణేష్, వీఓఏలు మంత్రాల మంగమ్మ, ఎలుక కోటిరెడ్డి, లెంకల వసంత, అవుట సైదులు, సువర్ణ, సామ్రాజ్యం పరుశరామ్, జానకమ్మ, రాణి, పుష్ప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మండల కేంద్రంలో వీఓఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో భాగంగా వీఓఏలు చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు మద్దతుగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య పాల్గొని మాట్లాడారు. వీఓఏలకు కనీస వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి రూ.10లక్షల ప్రమాదబీమా, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏల మండల అధ్యక్షురాలు రంగినేని చంద్రకళ, కార్యదర్శి గంటా మంజుల, లెంకలపల్లి పాపాచారి, నక్క సిరియాల, పగిళ్ల పురుషోత్తం, శిరీష, మానస, భాగ్యలక్ష్మి, కల్పన, శోభ, పద్మ, సరిత, భారతమ్మ, భీమ్‌జి, వనజ, సునంద, యాదమ్మ, విజయ, కవిత పాల్గొన్నారు.

నాంపల్లి : వీఓఏలకు బీమా సౌకర్యం కల్పించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఓఏలు చేస్తున్న సమ్మె శుక్రవారం ఐదోరోజుకు చేరింది. ఈ సమ్మెకు సీపీఎం అనుబంధం రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో పీఎస్ఎం జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వాసిపాక ముత్తిలింగం, సైదాబేగం, పరహానా, రోజారాణి, వెంకటమ్మ, సత్యం, చంద్రకళ, హవానీ, సుజాత, తదితరులు ఉన్నారు.

చెవిలో పువ్వులతో వీఓఏల నిరసన

కేతేపల్లి : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం ఐదోరోజుకు చేరింది. ఈ సమ్మెలో వీఓఏలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమ్మెకు సీఐటీయూ మండల కన్వీనర్ ఆదిమళ్ల సుధీర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వీఓఏలు కాడంగి వీరభద్రయ్య, తండు సుమీల, ఏడాకుల సంధ్య, రాణి, విజయశాంతి, సరిత, విజయ, మంజుల, సత్యనారాయణ, పద్మ, సంధ్య, వరలక్ష్మి పాల్గొన్నారు.

నకిరేకల్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీఓఏలు పట్టణంలోని ప్రధాన కూడలిలో చేపట్టిన సమ్మె శుక్రవారం 5వరోజుకు చేరింది. ఈ సమ్మెలో భాగంగా వీఓఏలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో సీఐటీయూ జిల్లా నాయకుడు వంటిపాక వెంకటేశ్వర్లు, గోర్ల యాదగిరి, సంధ్య, అరుణ పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం వీఓఏల సమస్యలు పరిష్కరించి సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఓఏలు చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. సమ్మెలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనువాసులు పాల్గొన్నారు. సమ్మెలో వీఓఏల మండల అధ్యక్షురాలు ఎదుళ్ల లక్ష్మి, కార్యదర్శి గుడిసె సువర్ణ, వనజకుమారి, పాకాల సత్యనారాయణ, గుడిసె పద్మ, దేశపాక సత్తమ్మ, విజయ, కళమ్మ పాల్గొన్నారు.



నాంపల్లిలో సమ్మె చేస్తున్న వీఓఏలు



కేతేపల్లిలో చెవిలో పువ్వులతో నిరసన..



మర్రిగూడలో..

గ్రంథాలయ సేవలు మరింత విస్తరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : గ్రంథాలయ సేవలు మరింత విస్తరించాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ శాఖల ఉద్యోగులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పుస్తకాలు, సభ్యత్వ నమోదు, లైబ్రరీ సెస్, ఉచిత భోజనం, మౌలిక వసతులు తదితర అంశాలపై చర్చించారు. ఉద్యోగులు అంకితభావంతో సేవలు అందించి గ్రంథాలయానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఉద్యోగులు గ్రంథాలయాల అభివృద్ధికి సూచనలు చేశారు. సమావేశంలో కార్యదర్శి బాలమ్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈద్గాకు ఆటోలో ఉచిత ప్రయాణం

నల్లగొండ రూరల్ : పవిత్ర రంజాన్ సందర్భంగా పట్టణంలోని మునుగోడు రోడ్డులో గల ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు జై జవాన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు కె.సైదులు ముస్లింలకు ఉచిత ఆటో ప్రయాణం కల్పించాడు. ఉచిత ప్రయాణం కల్పించడం పట్ల డ్రైవరును పలువురు అభినందించారు.

సంక్షిప్త సమాచారం

మంత్రి హరీశ్‌రావుకు వినతి

నాంపల్లి : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్ శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలిశారు. మండలంలో 100పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, వెనకబడిన మండలానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో కోరినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నల్లగొండ : పట్టణంలోని రవీంద్రనగర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బండ జోసెఫ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీన్ శేఖవర్మ, మాధవి, ఉమా, కరిష్మా, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండల పరిధిలోని ధర్వేశిపురం గ్రామానికి చెందిన ఇంజమూరి అంజమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబానికి శుక్రవారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి రూ.10వేలు, స్థానిక సర్పంచ్ అల్లుబెల్లి పూలమ్మ కుమారుడు అల్లుబెల్లి నర్సింహారెడ్డి రూ.5వేలు, బీఆర్‌ఎస్ నాయకుడు, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నకిరేకంటి శైలజసైదులు, మద్దిరాల శ్రీనివాస్‌రెడ్డి, గట్టిగుండ్ల గిరి, శ్రీశైలం, జినకుంట్ల జయశంకర్, అరెకంటి నర్సింహ, మాద నర్సింహ, రాములు, అంజయ్య పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండల కేంద్రానికి చెందిన బత్తెం అంజమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో అంజమ్మ కుటుంబానికి ఆమెతో పాటు కలిసి చదువుకున్న పదోతరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం రూ.32వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తాటిపాముల జయరాజు, నిమ్మల శ్రీనివాస్, వాడపల్లి అంజి, నోముల రమేష్, కంది వెంకన్న, బండారు ధనుంజయ్, శ్రీకాంత్, నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా రాములు

నకిరేకల్ : మండలంలోని తాటికల్ గ్రామానికి చెందిన చెనగాని రాములు బీజేపీ మండలం ప్రధాన కార్యదర్శిగా శుక్రవారం నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వుల కాపీని ఆ పార్టీ మండల అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి రాములుకు అందజేశారు. బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

జనజాతర ప్రచార కరపత్రాల విడుదల

నకిరేకల్ : నల్లగొండలో ఈనెల 28న కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే పూలే జనజాతర కార్యక్రమ ప్రచార కరపత్రాలను పట్టణంలో శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంజి మురళీధర్ విడుదల చేశారు. కార్యక్రమంలో చిలుకూరి లక్ష్మీనర్సయ్య, సకినాల రవి, ఆరూరి వెంకటేశ్వర్లు, గాదగోని కొండయ్య, రాచకొండ వెంకట్‌గౌడ్, వంటేపాక కృష్ణ, సాకుంట్ల నర్సింహ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

కేతేపల్లి : మండల కేంద్రంలో నెలకొన్న తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ కోరారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఏటా వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.